సబ్సిడీపై పచ్చి రొట్టె ఎరువులు

దుండిగల్‌: 50 శాతం రాయితీపై జనుము, జీలుగు విత్తనాలను అందజేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి యాదగిరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భౌరంపేట్‌, ధూలపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జనుము 40 కిలోల బస్తా రూ. 5,020 కాగా రూ. 2,510, జీలుగు 30 కేజీల బస్తా ధర 4,275 కాగా రైతులు రూ. 2137.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌ పుస్తకం, ఆధార్‌, ఫోన్‌ నంబర్‌తో వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న పంబి శ్రీనివాస్‌ నాయీ

జగద్గిరిగుట్ట: నాయీ బ్రాహ్మణులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ ఉద్యమ నాయకుడు పంబి శ్రీనివాస్‌ నాయి, మదన్‌నాయి, సీఎం రేవంత్‌ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. ఇతర కులస్తులు విచ్చలవిడిగా సెలూన్‌ బార్బర్‌ షాప్‌ పెట్టి తమ ఉపాధిని దెబ్బకొడుతున్నారన్నారు. దీనిపై ప్రత్యేక జీఓ తేవాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని హామీనిచ్చినట్లు తెలిపారు.

రసాయన పొగ వదిలే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



జీడిమెట్ల: జీడిమెట్ల పారిశ్రామికవాడలో చినుకు పడగానే పరిశ్రమల నుంచి రసాయనాల పొగలు వెలువడుతున్నాయి. ఈ విషయమై పీసీబీ అధికారులకు పలుమార్లు పిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు స్పందించి నాలాల్లోకి రసాయనాలు వదిలే పరిశ్రమలను గుర్తించి సీజ్‌ చేయాలని వారు కోరుతున్నారు.

ప్రయాణికుడికి బ్యాగు అప్పగింత

మియాపూర్‌: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగులో రూ.3.5లక్షల విలువచేసే వస్తువులను ఆర్టీసీ మియాపూర్‌- 2 డిపో డ్రైవర్‌ రమేష్‌ ఆ ప్రయాణికుడికి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు ఇలా.. జేఎన్‌టీయూకు చెందిన అల్లూరి చిట్టిబాబు ఆదివారం శంషాబాద్‌ నుండి పుష్పక్‌ బస్సులో వచ్చాడు. జేఎన్‌టీయూ వద్ద బస్సు దిగే సమయంలో బ్యాగు మర్చిపోయి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత బస్సు డ్రైవర్‌ రమేష్‌ బ్యాగును గమనించి డిపో అధికారులకు అందజేశారు. ఆ బ్యాగును పరిశీలించగా అందులో రూ.3.5 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌, విద్యా ధ్రువపత్రాలు, వ్యాలెట్‌ గమనించారు. అధికారులు ప్రయాణికుడు చిట్టిబాబు సమాచారం కనుగొని సోమవారం మియాపూర్‌-2 డిపోలో మేనేజర్‌ వెంకటేశం అధికారులతో కలిసి చిట్టిబాబుకు బ్యాగును అందజేశారు. డ్రైవర్‌ రమేష్‌ను అభినందించి శాలువా కప్పి సన్మానించారు.

టిప్పర్‌ లారీ ఢీకొని యువకుడి మృతి

మియాపూర్‌: టిప్పర్‌ లారీ ఢీకొని సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి మృతి చెందిన ఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా బంజారాపల్లికి చెందిన అల్వబోజు కోటేశ్వర్‌(27) సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి. చందానగర్‌లో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం అమీర్‌పేట్‌లో ఉంటున్న చిన్నాన్న కుమారుడు శ్రీకాంత్‌ను కలిసేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు అమీర్‌పేట్‌ నుంచి చందానగర్‌కు వస్తుండగా మియాపూర్‌ ఆల్విన్‌ క్రాస్‌ రోడ్డు సిగ్నల్‌ వద్ద హాఫీజ్‌పేట్‌ నుంచి ఆల్విన్‌ క్రాస్‌ వైపునకు వస్తున్న టిప్పర్‌ లారీ అతివేగంగా వచ్చి కోటేశ్వర్‌ను ఢీకొట్టింది. దీంతో కోటేశ్వర్‌ కిందపడగా తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మియాపూర్‌ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. టిప్పర్‌ లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడు సోదరుడు అరవింద్‌ మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీళ్లు ఇంకేదెలా..?

అధ్వానంగా ఇంకుడుగుంతలు
- చెత్తాచెదారాలతో నిండిన వైనం
- నిర్వహణ లేక నిరుపయోగం
- రోడ్లపైనే పారుతున్న వర్షపు నీరు

రంగారెడ్డినగర్‌: భూగర్భ జలాల పెంపునకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు అధ్వానంగా మారాయి. గతంలో లక్షలాది రూపాయల జీహెచ్‌ఎంసీ, జలమండలి నిధులతో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో ఆనవాళ్లే లేకుండా పోయాయి. గాజులరామారం, కుత్బుల్లాపూర్‌ జంట సర్కిళ్ల పరిధిలో 2019లో 151 ఇంకుడు గుంతలు, 2020లో రూ.22.22 లక్షలతో 120కి పైగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినా వాటిలో చాలావరకు కనమరుగయ్యాయి. ఆయా బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాలు వీటి నిర్వహణలో భాగస్వాములు కావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అలాగే పలుచోట్ల ఇంకుడు గుంతల్లో చెత్తాచెదారాలు వేయడంతో పూడుకుపోయాయి. దీంతో ఏటా వర్షాకాలంలో వరద రోడ్లపైనే పారుతూ డ్రైనేజీల్లో కలుస్తూ వృథాగా పోతోంది. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాత వాటిని పునరుద్ధరించకపోగా, కొత్తవాటి ఊసే ఎత్తకపోవడంతో భూమిలోకి వర్షపునీరు ఇంకే పరిస్థితులు కనిపించడం లేదు.

1200 అడుగులు పైచిలుకు వేస్తేనే నీరు..

జీడిమెట్ల, షాపూర్‌నగర్‌, రంగారెడ్డినగర్‌, జగద్గిరిగుట్ల, సుచిత్ర, గాజులరామారం, కుత్బుల్లాపూర్‌ తదితర ప్రాంతాల్లో ఒకప్పుడు 700 ఫీట్లకే నీళ్లు పడేవి. కాలక్రమేణా ఇళ్ల నిర్మాణాలతో పాటు జనాభా పెరిగిపోవడం చాలాప్రాంతాల్లో బోర్లు ఎండిపోయాయి. దీంతో జలమండలి సరఫరా చేస్తున్న తాగునీరు, ప్రైవేట్‌ ట్యాంకర్లపైనే ఆధార పడుతున్నారు.



షాపూర్‌నగర్‌ సెక్షన్‌ జలమండలి కార్యాలయ ఆవరణలో ఇంకుడు గుంత పరిస్థితి

కాగితాల్లోనే నిబంధనలు..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 300 గజాల పైబడిన నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని గ్రేటర్‌ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జంట సర్కిళ్ల పరిధిలో చేపట్టే భారీ నిర్మాణాలపై టౌన్‌ ప్లానింగ్‌ నిఘా లేకపోవడంతో ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అనుమతి ఇచ్చామా.. జీహెచ్‌ఎంసీకి ఆదాయం సమకూరిందా అనే ధోరణిలోనే ఉన్నారే తప్ప భూగర్భ జలాల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ఏమాత్రం ఆలోచించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కుత్బుల్లాపూర్‌ జలమండలి ప్రధాన కార్యాలయంలో..

నిబంధనలు గాలికి..

ఇంకుడు గుంత ఉంటేనే ఇంటికి నల్లా కలెక్షన్‌ మంజూరు చేస్తామని ప్రకటించిన జలమండలి అధికారులు వాటిని మాటలకే పరిమితం చేస్తున్నారు. ఇటీవల నూతనంగా జారీ చేసిన కనెక్షన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు నిర్మాణాలకు ఇంకుడు గుంతలు నిర్మించారా..? లేదా..? అనేవి చూడకుండానే కనెక్షన్లు ఇచ్చారనేది బహిరంగ రహస్యం.



ఆదర్శనగర్‌లో ..

జలమండలి అధికారులది అదే తీరు..

కుత్బుల్లాపూర్‌ జలమండలి డివిజన్‌ పరిధిలోని చింతల్‌ సెక్షన్‌ పరిధిలో 10, జగద్గిరిగుట్ట సెక్షన్‌లో 10, జీడిమెట్ల సెక్షన్‌లో 22, షాపూర్‌నగర్‌ సెక్షన్‌ పరిధిలో 20 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసినా నిర్వహణ లేక వాటి రూపు రేఖలే మారిపోయాయి. షాపూర్‌నగర్‌ సెక్షన్‌ కార్యాలయంలో ఇంకుడు గుంతలు పూడుకుపోగా, కుత్బుల్లాపూర్‌ జలమండలి కార్యాలయ ఆవరణలోని ఇంకుడు గుంతలో మొక్కలు మొలిచాయి.



సౌభాగ్యనగర్‌లో..

ప్రజావాణిలో 17 ఫిర్యాదులు

జగద్గిరిగుట్ట: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం సర్కిల్‌ ఉప కమిషనర్‌ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 3 ఫిర్యాదులు రాగా వాటిలో ఇంజినీరింగ్‌, ఎలక్ట్రికల్‌, శానిటేషన్‌ విభాగాల వారీగా ఒక్కో ఫిర్యాదు వచ్చింది. అదేవిధంగా కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొత్తం ఫిర్యాదులు 9 రాగా వాటిలో టౌన్‌ ప్లానింగ్‌ 4 రెవెన్యూ 2 ఇంజినీరింగ్‌ 2 డ్రైనేజీ సమస్యపై మరొక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.

కనిపించని అధికారులు..

కుత్బుల్లాపూర్‌ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రధానాధికారులు కనిపించకపోవడం విశేషం. కేవలం అసిస్టెంట్లను కూర్చోబెట్టి అధికారులు మాత్రం బయట తిరుగుతున్నట్లు సమాచారం. ప్రతి వారం ఇదే తంతు కొనసాగుతోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉప కమిషనర్‌

వాటర్‌ వర్క్స్‌ కార్యాలయంలో 5 ఫిర్యాదులు..

చింతల్‌: కుత్బుల్లాపూర్‌ వాటర్‌ వర్క్స్‌ జీఎం అశోక్‌ అధ్యక్షతన సోమవారం జరిగిన ప్రజావాణిలో 5 ఫిర్యాదులు వచ్చాయి. సూరారం సెక్షన్‌ వెంకట్రామ్‌ నగర్‌లో నూతనంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ వేయాలని జానకీరాం ఫిర్యాదు చేశారు. అలాగే చింతల్‌ సెక్షన్‌ ఐడీఏ జీడిమెట్లలోని డెక్కన్‌ ఫార్చునర్‌ అండ్‌ మేక్‌ అనే కంపెనీకి 10 రోజులుగా నీరు సరఫరా కావడం లేదంటూ ఫిర్యాదు చేయగా, రుక్మిణి ఎస్టేట్‌లో కొంతమంది ప్రైవేట్‌ ల్యాండ్‌ నుంచి వచ్చే పైపులైను విషయమై శోభ, అదేవిధంగా సూరారం సెక్షన్‌లో రాజీవ్‌ గాంధీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైప్‌ లైన్లు శుభ్రం చేయాలని శ్రీనివాస్‌ ఫిర్యాదు చేయగా, సూరారం ప్రధాన రోడ్డు రామ లీలా మైదాన్‌ ఎదుట భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ నుంచి మురుగునీరు అంతా రోడ్లపై పారుతోందని నవీన్‌ కుమార్‌ ఫిర్యాదు చేశారు. అనంతరం జీఎం అశోక్‌ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఆయా సెక్షన్ల మేనేజర్లకు బదిలీ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. డీజీఎంలు రాజేశ్‌, వికాస్‌, వాటర్‌ వర్క్స్‌ మేనేజర్లు, ఎలక్ట్రికల్‌ మేనేజర్‌, సూపరింటెండెంట్‌, వాటర్‌ బాక్సర్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించండి

కుత్బుల్లాపూర్‌: బహదూర్‌పల్లి డబుల్‌ బెడ్రూం లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్‌ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ మేడ్చల్‌ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ గౌతమ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది ఏప్రిల్‌ నుంచి లబ్ధిదారుల వద్ద ప్రతి నెల నిర్వహణ పేరిట ఒక్కొక్క ప్లాట్‌ నుంచి రూ. 1000, అలాగే సభ్యత్వం కోసం రూ. 1100 వసులు చేస్తున్నారన్నారు. ఇటీవల ఆ సముదాయాలను సందర్శించి అవకతవకలు తెలుసుకుని సమస్యలపై ఆరా తీశానన్నారు. నూతన సొసైటీ ఏర్పాటు చేయాలన్నారు. 780 లబ్ధిదారుల కుటుంబాల నుంచి వసూలు చేసిన డబ్బులు, దుకాణాల కిరాయి, అడ్వాన్స్‌, కరెంట్‌ బిల్‌ పేరిట జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డబుల్‌ బెడూం్ర లబ్ధిదారులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ గౌతమ్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలపై ఫిర్యాదు



భగత్‌సింగ్‌నగర్‌ స్టార్‌లైట్‌ అపార్ట్‌మెంట్స్‌ వెనుక గల ప్రభుత్వ భూమిలో వెలిసిన కట్టడాలు

చింతల్‌: భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది తప్పుడు సర్వే నంబర్‌ వేసి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేపట్టారని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రాజు అనే వ్యక్తి హైడ్రా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కమిషనర్‌ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్‌ 155 దానిపక్కనే ఉన్న స్టార్‌లైట్‌ అపార్ట్‌మెంట్స్‌ వెనకాల ఉన్న సర్వే నంబర్‌ 148 లో పక్కన నుంచి సుమారు 20 బస్తీల నుంచి వచ్చే వర్షపు నీరు, స్థానికంగా ఉండే బస్తీల మురుగునీరు ప్రవహిస్తూ మూసీ నదిలో కలిసే నాలాకు ఆనుకొని సుమారు 30 గుంటల మేర బఫర్‌ జోన్‌లో ప్రభుత్వ స్థలం కలిగి ఉంది. ఈ స్థలాన్ని కొంతమంది తప్పుడు సర్వే చేయించి అక్రమల లేఅవుట్‌ రూపొందించారని, ఇందులో ఒక్కో ప్లాటును రూ. 25 లక్షలకు చొప్పున విక్రయించి దండుకున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను తొలగించి పార్కుకు కేటాయించాలని ఫిర్యాదు చేయగా మరికొంతమంది నందానగర్‌కు చెందిన నాయకులు ఇదే స్థలంపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఇంటి సెటిల్‌మెంట్‌లో తలదూర్చిన కార్పొరేటర్‌పై కేసు

జీడిమెట్ల: ఇంటి సెటిల్‌మెంట్‌ విషయంలో తలదూర్చి ఇంటిని కొన్న బాధితుడిని దుర్భాషలాడిన సూరారం డివిజన్‌ కార్పొరేటర్‌పై కోర్టు ఆదేశాల మేరకు జీడిమెట్ల పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మార్కండేయనగర్‌కి చెందిన అంబదాస్‌ నుంచి ఓ ఇంటిని రూ.85 లక్షలకు కొనుగోలు చేసేందుకు అంజన్‌ గౌడ్‌ అనే వ్యక్తి ఒప్పందం చేసుకున్నాడు. అయితే గడువు ముగిసినా డబ్బులు చెల్లించడం లేదంటూ అంబదాస్‌ కార్పొరేటర్‌ను ఆశ్రయించాడు. దీంతో కార్పొరేటర్‌ అంజన్‌గౌడ్‌కు ఫోన్‌ చేసి దుర్భాషలాడగా మనస్థాపానికి గురైన అంజన్‌గౌడ్‌ తన స్నేహితుడు లక్ష్మణ్‌కి ఫోన్‌ చేసి కార్పొరేటర్‌ అసభ్యంగా దూషించాడని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. దీంతో లక్ష్మణ్‌ ఇదే విషయాన్ని పోలీసులు, కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులు అంజన్‌గౌడ్‌ ప్రదేశాన్ని గుర్తించి ఆత్మహత్య చేసుకోకుండా రక్షించారు. మరుసటి రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయస్థానం ఆదేశాలతో సూరారం కార్పొరేటర్‌ మంత్రి సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇంటిని విక్రయించిన అంబదాస్‌ ఇంటిపై అంజన్‌గౌడ్‌ దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అంజన్‌గౌడ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అవగాహన ఒప్పందం

నిజాంపేట్‌: వీఎన్‌ఆర్‌ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ, పిడిలైట్‌ గ్రూప్‌కు చెందిన డాక్టర్‌ ఫిక్సిట్‌ ఇనిస్టిట్యూట్‌తో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై కాలేజీ ప్రిన్సిపాల్‌ డా.సి.డి. నాయుడు, డా. ఫిక్సిట్‌ ఇనిస్టిట్యూట్‌ ప్రెసిడెంట్‌ మెహుల్‌ కిరిట్‌ పారిఖ్‌ సంతకాలు చేశారు. ఇందులో భాగంగా వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీలో స్ట్రక్చరల్‌ రిహాబిలిటేషన్‌, ప్రొటక్షన్‌ కోసం శిక్షణ, అనుభవ కేంద్రాన్ని డా. ఫిక్సిట్‌ ఇనిస్టిట్యూట్‌ ఏర్పాటు చేస్తుందని మెహుల్‌ కిరిట్‌ పారిఖ్‌ తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న అభివృద్ధిని తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్‌ బ్రాంచ్‌ అధిపతి డా.రాముజీ, డా.ఫిక్సిట్‌ ఇనిస్టిట్యూట్‌ శిక్షణాధిపతి తర్థీ ప్రతిమ్‌ బెనర్జీ, ప్రాంతీయ శిక్షణ మేనేజర్‌ గౌతమ్‌ సూర్‌, శిక్షణ మేనేజర్‌ సీమీ పి.సామ్‌శెట్టి, వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీ డైరెక్టర్‌ ఫర్‌ అడ్వాన్స్‌మెంట్‌ డా.బి.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



వరంలా ఈవీ చార్జింగ్‌ స్టేషన్‌..!

జీడిమెట్ల: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్‌ చార్జింగ్‌ స్టేషన్‌ ఈవీ వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. 6 నెలల క్రితం జీడిమెట్ల ఇండస్ట్రియల్‌ ఏరియా ఫేజ్‌-5లోని శ్రీపతి కెమికల్స్‌ ఎదుట ఎలక్ట్రికల్‌ చార్జింగ్‌ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం పారిశ్రామికవేత్తలు వారి కార్లకు చార్జింగ్‌ పెట్టుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ వారు ఏర్పాటు చేసిన ఈ స్టేషన్‌ ఎంతో ప్రయోజనకరంగా ఉందని, ఒక బోర్డును ఏర్పాటు చేస్తే ఇంకా చాలామంది చార్జింగ్‌ పాయింట్‌ను వాడుకునే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కారు చార్జింగ్‌ చేసుకునే విధానం..
- మొదటగా ప్లేస్టోర్‌ ద్వారా టీఎస్‌ఈవీ అప్లికేషన్‌ను ఫోన్లో డౌన్‌లోడ్‌ చేసుకోవాలి.
- చార్జింగ్‌ స్టేషన్‌ ఏరియా సెలెక్ట్‌ చేసుకోవాలి.
- రూట్‌మ్యాప్‌ ద్వారా నేరుగా అక్కడికి చేరుకోవాలి.



పాయింట్‌ వద్ద చార్జింగ్‌ పెట్టిన కార్లు

- కారు పార్క్‌ చేసి చార్జింగ్‌ గన్‌ను అమర్చుకోవాలి.
- అప్లికేషన్‌ ద్వారా కారుకు ఎంత కరెంట్‌ వినియోగిస్తారో అంతే పేమెంట్‌ అప్లికేషన్‌ ద్వారా కట్టాలి.
- వెంటనే కారుకు చార్జింగ్‌ మొదలవుతుంది.
- చార్జింగ్‌ పూర్తికాగానే దానంతట అదే ఆగిపోతుంది.
- చార్జింగ్‌ గన్‌ను తీసిన చోటు అమర్చి వెళ్లిపోవచ్చు.

చెరువులో మురుగునీరు కలవకుండా చూడాలి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న అంజనేయులు

దుండిగల్‌: చెరువుల్లో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులు కోరారు. ఈ మేరకు మేడ్చల్‌ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లంపేటలో 3 చెరువులు ఉన్నాయని, ముఖ్యంగా కత్వ చెరువులో మత్స్యకారులు చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్నారన్నారు. అయితే కొద్ది కాలంగా రెడ్డి ల్యాబ్స్‌, లక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్‌, లహరీ గ్రీన్‌ పార్క్‌ తదితర వెంచర్లు, అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే మురుగునీరు కత్వ చెరువులో చేరుతోందన్నారు. అధికారులు స్పందించి చెరువులో డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి కృషి

నిజాంపేట్‌ : ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు అన్ని రంగాల్లో రాణించేలా వారి అభ్యున్నతికి కేంద్రం ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్‌ రామ్‌ మాంఝీ అన్నారు. గాజులరామారం మిథిలానగర్‌లో గల ఎలీఫ్‌ ఇండస్ట్రీస్‌ ఆధ్వర్యంలో ఉద్యమి నుంచి ఉన్నతి-వికాస్‌ భారత్‌ కోసం మహిళా పారిశ్రామికవేత్తలతో భవిష్యత్‌ నిర్మాణం అనే అంశంపై సోమవారం కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇన్నోవేషన్‌, సుస్థిరతపై ప్రేరణాత్మక సెషన్లు, మహిళా పారిశ్రామికవేత్తల విజయ గాథలు, సమగ్ర గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ అభివృద్ధిపై చర్చలు, గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ పార్కులు, ఔత్సాహిక వాతావరణం అభివృద్ధిపై చర్చలు, గ్రీన్‌ ఇండస్ట్రియల్‌ పార్కులు, ఔత్సాహిక వాతావరణంలో ఎలీఫ్‌ పాత్ర అనే అంశాలపై చర్చించారు. పీఎం విశ్వకర్మ ఎంఎస్‌ఎంఈ కేంద్ర మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌ మిలింద్‌ ధర్మారావు రాంటేకే, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా మంత్రిత్వశాఖ సంయుక్త సంచాలకులు మెర్సి ఏపావో పాల్గొన్నారు.



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జితన్‌రామ్‌ మాంఝీ

ఆస్తి పన్ను వసూళ్లలో మార్పు!

- నగదు లావాదేవీల్లో అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది తొలగింపు
- 29 పురపాలికల్లో రెగ్యులర్‌ ఉద్యోగులకు బాధ్యతలు

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్ల విధానంలో ప్రభుత్వం మార్పులు చేసింది. నగదు లావాదేవీల నిర్వహణ నుంచి అవుట్‌సోర్సింగ్‌ సిబ్బందిని తప్పించి, వార్డు ఆఫీసర్లకు అప్పగించారు. సరిపడాలేని పురపాలికల్లో సీనియర్‌, లేదా జూనియర్‌ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పజెప్పారు. ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలు అమలు చేయటంతో నగదు లావాదేవీల్లో అవకతవకలను పూర్తిగా నియంత్రించవచ్చని, పుర యంత్రాంగం భావిస్తోంది. రాష్ట్రంలోని పలు పురపాలిక(పట్టణాలు)ల్లో ఆస్తిపన్ను వసూళ్లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. దీన్ని అరికట్టేందుకు తాజాగా ఆస్తిపన్నుల వసూళ్లలో నూతన నిబంధనలను రూపొందించి అన్ని పురపాలికల్లో అమలుచేస్తోంది.

జమ చేయడం లేదని..

మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని పలు పురపాలికల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆస్తిపన్నులు వసూలు చేస్తున్నారు. పురపాలక సంఘం కార్యాలయంలోని సిటిజన్‌ సర్వీస్‌ సెంటర్‌లో ఆస్తిపన్ను చెల్లించిన వారికి కంప్యూటరైజ్డ్‌ రశీదు అందజేస్తున్నారు. అయితే.. పలు పురపాలికల్లో ఆస్తిపన్నుల లావాదేవీల విధులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది వసూలైన ఆస్తిపన్ను డబ్బులను సకాలంలో క్యాష్‌కౌంటర్‌లో జమచేయడం లేదన్న ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో రాష్ట్ర మున్సిపల్‌ శాఖ ఆదేశాలను జారీ చేసింది.

రెగ్యులర్‌ ఉద్యోగులకే బాధ్యతలు

పురపాలికల్లో ఏటా ఆస్తిపన్ను వసూళ్లను సిబ్బంది చేతి యంత్రాల్లో (హ్యాండ్‌ హెల్డ్‌ మెషిన్‌) పీటీఐఎన్‌ (ప్రాపర్టీ ట్యాక్స్‌ ఐడెంటిఫికేషన్‌ నెంబర్‌) నమోదు చేసి ఎంతమేర పన్ను ఉందో చెప్పి, డబ్బులు వసూలు చేసి రశీదును అందజేస్తారు. సేకరించిన డబ్బులను పురపాలికల్లోని క్యాష్‌ కౌంటర్‌లో జమచేస్తారు. పన్నువసూళ్లకు చాలాచోట్ల అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఉద్యోగుల పేరిటే యంత్రాలు

వాస్తవానికి చేతి యంత్రాలు (మిషన్లు) రెగ్యులర్‌ ఉద్యోగుల పేరిటే ఉన్నా.. ఉద్యోగుల కొరత కారణంగా అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిన విధులు చేపడుతున్నారు. అవుట్‌ సోర్సింగ్‌ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. దీంతో వారిని పన్ను వసూళ్ల నుంచి తప్పించి రెగ్యులర్‌ ఉద్యోగులనే నగదు లావాదేవీలు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాలని పురపాలకశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మేడ్చల్‌-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో రెగ్యులర్‌ ఉద్యోగుల కొరత ఉన్న చోట.. సీనియర్‌ లేదా జూనియర్‌ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించారు.



పకడ్బందీగా అమలు..

పురపాలికల్లో ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్ర మున్సిపల్‌ శాఖ సూచించిన నిబంధనలను ఆయా పురపాలక సంఘాల కమిషనర్లు అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగిన కారణంగా పురపాలకశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే పురపాలక అధికార యంత్రాంగం అవుట్‌సోర్సింగ్‌ సిబ్బందితో నగదు లావాదేవీల నిర్వహణ విధులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది.